నిమ్స్‌లోకి వెళ్లేదెట్లా?

- నడిచే దారిలో కార్లు, ద్విచక్ర వాహనాల పార్కింగ్
- పాదచారులకు ఇబ్బందులు


నిమ్స్‌లో నడిచే దారిలో పార్కింగ్ చేసిన వాహనాలు

నిమ్స్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పేదల కార్పొరేట్ ఆస్పత్రి నిమ్స్‌లో పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంది. రోజుకు కనీసం రెండు వేల నుంచి మూడు వేల మంది రోగులు ఆస్పత్రికి వస్తుంటారు. సుమారు 150 మంది కార్లలో వస్తారు. ఈ సంఖ్య సోమవారం, బుధవారం ఎక్కువగా ఉంటుంది. వాహనాలకు పార్కింగ్ వసతి లేక పోవడంతో నడిచే దారిలో నిలుపుతున్నారు. దీంతో పాద చారులు అనేక అవస్థలు పడుతున్నారు.

పార్కింగ్ ప్రదేశంలో ఆస్పత్రి విస్తరణ

నిమ్స్‌కు రోగుల తాకిడి పెరుగుతుండడంతో ప్రభుత్వం విస్తరణ వైపు దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఆస్పత్రి ఆవరణలో ఉన్న ఖాళీ ప్రదేశాన్ని ఎంచుకుంది. వాస్తవానికి విశాలంగా ఉన్న ఈ స్థలంలో కార్లు, వాహనాల పార్కింగ్ ఉండేది. నిమ్స్‌కు వచ్చే వాహనాలకు ఇది సరిపోయేది. ఇప్పుడు విస్తరణలో భాగంగా భవన నిర్మాణాలు మొదలయ్యాయి. దీంతో పార్కింగ్ వ్యవస్థ లేకుండా పోయింది. రెండుచోట్ల పార్కింగ్ లాట్‌లు ఉన్నా, అవి ద్విచక్ర వాహనాలు పెట్టేందుకు మాత్రమే సరిపోతుంది. కార్లకు సైతం ఓ లాట్ ఉండడంతో అందులో వాహనాలు సరిపోవడం లేదు. దాంతో ఆస్పత్రి ఆవరణలో ఖాళీ ప్రదేశాలు లేకపోవడంతో ప్రధాన రహదారికి ఒక పక్కన వాహనాలను పార్కు చేస్తున్నారు. చికిత్స కోసం నడిచి వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు.

ఎక్కడ చూసినా వాహనాలే..

నిమ్స్ ప్రధాన గేటు నుంచి లోపలకు వెళ్లే మార్గంలో కుడిచేతి వైపున కార్లను పార్కు చేస్తున్నారు. మరోవైపున అదే దారిలో ఆస్పత్రిలోకి వాహనదారులు వెళ్లాల్సి ఉంది. ఒక పక్కన వాహనాల పార్కింగ్ ఉండగా, మిగతా రోడ్డులో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లలో రోగులు ఆస్పత్రిలోకి వెళ్తుంటారు.

మల్టీలెవెల్ పార్కింగ్ అవసరం

నిమ్స్ ఆస్పత్రిలో వాహనాల పార్కింగ్ సమస్య తీరాలంటే మల్టీలెవెల్ పార్కింగ్ సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉంది. ఒకప్పుడు ద్విచక్ర వాహనాలపై వచ్చేవారంతా ఇప్పుడు కార్లలో ఆస్పత్రికి వస్తున్నారు. దాంతో స్థల సమస్య ఏర్పడింది. ఆస్పత్రికి వైద్యం కోసం కార్లలో వచ్చేవారి సంఖ్య ఒకటైతే.. ఆస్పత్రి ఫ్యాకల్టీ, వైద్యుల కార్లు దానికి రెండు రెట్లు ఉంటాయి. నిమ్స్ ఆస్పత్రిలో పార్కింగ్ సమస్యను అధిగమించాలంటే మల్టీలెవెల్ పార్కింగ్ ఏర్పాటు అవసరమని నిమ్స్‌కు వచ్చే వాహనదారులు చెబుతున్నారు.

నడిచి వెళ్లేది ఎలా..

వివిధ ప్రాంతాల నుంచి నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చేవారు ప్రధాన గేటు నుంచి ఎమర్జెన్సీ విభాగం వరకు కిలోమీటర్ దూరం నడిచి వెళ్లాల్సిందే. రోడ్డుకు ఒకవైపు వాహనాలను పార్కు చేయగా, ఎడమ వైపు నుంచి వాహనదారులు వెళ్తున్నారు. కాగా, ఉన్న రోడ్డును వాహనదారులే ఆక్రమిస్తే నడిచి ఆస్పత్రిలోకి ఎలా వెళ్లాలని రోగులు, వారి సహాయకులు ప్రశ్నిస్తున్నారు. నిమ్స్ ఆస్పత్రి విస్తరణలో భాగంగా ఖాళీగా ఉన్న స్థలాల్లో భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీంతో వాహనాలను పార్కింగ్ చేసేందుకు తగినంత స్థలం లేక పార్కింగ్‌ను ప్రధాన రహదారిలో అనుమతిస్తున్నారు.



నడిచేందుకు ఇబ్బంది పడుతున్న జనం


రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి శుభాకాంక్షలు చెబుతున్న మాల వెలుగు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పట్ల లోకేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి దండు లక్ష్మణ్, రాష్ట్ర కార్యదర్శి రాజలింగం, నగర కార్యదర్శి దండు మన్యం తదితరులు

• బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి


ప్రకాశ్‌నగర్‌లో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

అక్రమ నిర్మాణం కూల్చివేత

బేగంపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రకాశ్‌నగర్‌లోని వెల్కిన్ పార్కు ఎదురుగా అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్డును జీహెచ్‌ఎంసీ బేగంపేట సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారం కూల్చివేశారు. ఇటీవల ఈ స్థలంపై పలు ఫిర్యాదులు రావడంతో పలుమార్లు అక్కడ అధికారులు సర్వే నిర్వహించారు. అందులో భాగంగా ఉదయం 7 గంటలకు పోలీసు, రెవెన్యూ విభాగాలతో పాటు ఎక్స్‌కవేటర్‌తో అక్కడకు చేరుకున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఈ క్రమంలో స్థల యాజమానులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినా, అధికారులు కూల్చివేతలు ఆపలేదు.

మేయర్‌ను దుర్భాషలాడిన వ్యక్తి అరెస్ట్

బంజారాహిల్స్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మేయర్‌ను ఫోన్‌లో దుర్భాషలాడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 1, 2, 5వ తేదీల్లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న బీఆర్‌ఎస్ మైనారిటీ నాయకుడు సర్దార్ మృతికి కారణమైన వారిని ఎందుకు పట్టుకోలేదని ప్రశ్నించడమే కాకుండా దుర్భాషలాడాడు. పలుమార్లు ఫోన్ చేసి వేధించాడు. మేయర్ పీఆర్‌ఓ అఖిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న బంజారాహిల్స్ పోలీసులు ఫోన్ నెంబర్ ఆధారంగా దర్యాప్తు మొదలుపెట్టారు. నిందితుడు ఐడీపీ బొల్లారం క్యాబ్ డ్రైవర్ రమేష్ అని గుర్తించారు. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

టీటీడీ ఆలయంలో చోరీకి యత్నించిన మైనర్

బంజారాహిల్స్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ తిరుమల తిరుపతి దేవస్థానంలో హుండీ చోరీకి యత్నించిన మైనర్‌పై కేసు నమోదైంది. గత నెల 28న ఇద్దరు మైనర్ బాలురు ఆలయానికి వచ్చారు. వస్త్ర హుండీ నుంచి డబ్బు దొంగిలించారు. అక్కడే ఉన్న విజిలెన్స్ సిబ్బంది వారిని పట్టుకున్నారు. మైనర్లు కావడంతో వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. హుండీలో నుంచి తీసిన రూ. 1,210 తిరిగి అందులో వేయించారు. ఈనెల 9న ఇద్దరిలో ఓ బాలుడు మరోసారి ఆలయానికి వచ్చాడు. అనుమానాస్పదంగా తిరుగుతూ హుండీలో నుంచి డబ్బు తీసేందుకు ప్రయత్నించాడు. విజిలెన్స్ సిబ్బంది పట్టుకున్నారు. ఆలయ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రమేష్ ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మంటలంటుకొని బాలికకు తీవ్రగాయాలు

బోరబండ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): టీ పెడుతుండగా ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ఓ బాలిక తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన బోరబండ పోలీ సుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్పీఆర్ హిల్స్ టి.అంజయ్యనగర్‌కు చెందిన మల్లేశ్వరి కూతురు మనీష(16) 10వ తరగతి పాసై ఇంటి వద్దనే ఉంటోంది. ఈనెల 9న గ్యాస్ స్టౌ పై టీ పెడుతున్న సమయంలో మసిగుడ్డ కనిపించక తన ఒంటిపై ఉన్న దుస్తులతో గిన్నె దించే ప్రయత్నం చేసింది. ప్రమాదవశాత్తు శరీరానికి మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో 70 శాతం శరీరం కాలింది. ఈమెను సనత్‌నగర్ ప్రాంతంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. బోరబండ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతిని వేధిస్తున్న యువకుడు

యూసుఫ్‌గూడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు వేధిస్తున్నాడని యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సంగారెడ్డికి చెందిన ఓ యువతి నివసిస్తుంది. 2021లో మూసాపేటకు చెందిన హేమంత్ కుమార్ పరిచయమయ్యాడు పరిచయం కాస్త స్నేహంగా మారడంతో ఇద్దరు కలిసి దిగిన ఫొటోలను మార్ఫింగ్ చేసి శారీరకంగా సహకరించాలని వేధిస్తున్నాడు. ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తానని బెదిరించాడు. తట్టుకోలేక ఆ యువతి బుధవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమించాలని వేధింపులు.. కేసు నమోదు

బేగంపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రేమించాలని యువతిని వేధిస్తున్న వ్యక్తిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేటకు చెందిన యువతి(22) కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటోంది. ఇదే ప్రాంతానికి చెందిన సాయి అఖిల్ కొంత కాలంగా యువతి వెంటపడుతూ ప్రేమించాలని వేధిస్తున్నాడు. యువతి పలుమార్లు అతడిని హెచ్చరించినా ప్రవర్తనలో మార్పు రాలేదు. మంగళవారం మద్యం తాగి యువతి ఇంటికి వచ్చి బెదిరించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనం మాయం

యూసుఫ్‌గూడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనం మాయమైంది. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహ్మత్‌నగర్‌కు చెందిన గొల్లపల్లి ప్రవీణ్ వ్యాపారి. మధురానగర్‌లోని స్నేహితుడి ఇంటికి ఈనెల 9న వచ్చాడు. ఇంటి ముందు తన ద్విచక్ర వాహనాన్ని నిలిపి స్నేహితుడి వాహనంపై టిఫిన్ చేయడానికి వెళ్లాడు. టిఫిన్ చేసి వచ్చే వరకు ఇంటి ముందు నిలిపిన వాహనం మాయమైందని ప్రవీణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సీసీ టీవీ బ్యాటరీలు..

యూసుఫ్‌గూడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సీసీ టీవీ బ్యాటరీలు మాయమైన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేటకు చెందిన పి.అశోక్ కుమార్ సీసీ టీవీ టెక్నీషియన్. ఈనెల 6న కృష్ణకాంత్ పార్కు, డంపింగ్ యార్డు, రహ్మత్ నగర్ చౌరస్తా, యూసుఫ్‌గూడ చౌరస్తా, మధురానగర్ ఓరా టవర్స్ ప్రాంతాలకు చెందిన సీసీ టీవీ బ్యాటరీలు మాయమయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడి అదృశ్యం

బోరబండ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మెంటల్ ఆస్పత్రిలో చికిత్స పొందిన వ్యక్తిని స్వగ్రామానికి తీసుకెళ్లేందుకు బంధువులతో కలిసి వచ్చిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రిలో చికిత్స పొందిన మెదక్ జిల్లా దౌల్తాబాద్ మండలం దౌలాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే యువకుడిని తీసుకెళ్లేందుకు బంధువులతో కలిసి కె.మల్లేశ్(35) ఈనెల 3న ఆస్పత్రికి వచ్చాడు. బంధువులంతా ఆస్పత్రి ఫార్మాలిటీస్ పూర్తి చేయడంలో నిమగ్నమై ఉండగా, ఆస్పత్రి నుంచి బయటకు వచ్చిన మల్లేశ్ అదృశ్యమయ్యాడు. దీంతో అతడి బావ అశోక్ బోరబండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.


బలహీనవర్గాల కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన

బోరబండ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన లభిస్తుందని నాట్కో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గీత కల్వారి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బోరబండ బలహీనవర్గాల కాలనీలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి బుధవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్వాడీలో చేర్పించాలి

బోరబండ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ నిర్మలక్రాంతి వెస్లీ కోరారు. రహ్మత్ నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ ఆరోగ్యనగర్ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన అమ్మ మాట - అంగన్వాడీ బాట కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు బాధ్యతగా తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ అక్కేశ్వర్, అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారుల తల్లులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మెడికవర్ ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీలు

హైటెక్‌సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రోబోటిక్ సర్జరీ ద్వారా నొప్పి తక్కువగా ఉండడమే కాకుండా రోగి వేగంగా కోలుకుంటారని మెడికవర్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ అనిల్ కృష్ణ తెలిపారు. బుధవారం మాదాపూర్‌లోని ఆస్పత్రిలో వైద్యులతో కలిసి ఆయన మాట్లాడారు. ఆరు నెలల్లో 15 మంది వైద్యులతో కూడిన బృందం 500 రోబోటిక్ సర్జరీలు చేసినట్లు తెలిపారు. యూరాలజీ వైద్యనిపుణులు డాక్టర్ ఏవీ రవికుమార్, డాక్టర్ కేవీఆర్ ప్రసాద్ మాట్లాడుతూ రోబోటిక్ సర్జరీల ద్వారా తమకు పని ఒత్తిడి తగ్గిందన్నారు. సమావేశంలో డాక్టర్లు వెంకట్ పవన్, శరత్‌చంద్ర కౌశిక్, రవిచందర్, అజయ్‌వరుణ్‌రెడ్డి, రాధిక, వరలక్ష్మి, పేరం పృథ్వీ, కౌశిక్‌శర్మ, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.


పోలీసులు అదుపులోకి తీసుకున్న వ్యభిచార ముఠా

బంజారాహిల్స్‌లో వ్యభిచార ముఠా గుట్టురట్టు

- ఆటకట్టించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు
- నిర్వాహకుడు సహా ఆరుగురు అరెస్టు
- నలుగురు యువతులును రక్షించిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్‌లో గుట్టుగా వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా గుట్టును రట్టు చేశారు వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు. ఒక నిర్వాహకుడు, ముగ్గురు కస్టమర్లు సహా.. ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. నలుగురు యువతులను రక్షించి హోమ్‌కు తరలించారు. అనంతపురానికి చెందిన కుమ్మెత నరేందర్‌రెడ్డి నగరంలోని బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12లో వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్నాడు. ఇతర ప్రాంతాల నుంచి యువతులను దిగుమతి చేసుకొని కస్టమర్లను ఆకర్షించి వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. ఒక్కో కస్టమర్ నుంచి రూ.4 వేల నుంచి రూ. 5 వేలు తీసుకుంటూ సొమ్ము చేసుకుంటున్నాడు. యువతులకు మాత్రం ప్రతి నెలా ఎంతో కొంత వేతనం ఇస్తూ దందా నిర్వహిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న వెస్టుజోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, బంజారాహిల్స్ పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడి చేసి నరేందర్‌రెడ్డితోపాటు అనుచరులు ఆనంద్‌కుమార్, రాహుల్ కుమార్, కస్టమర్లు తమిళనాడుకు చెందిన అయ్యన్ కోడిస్వామి(62), నిజామాబాద్‌కు చెందిన శ్రీనివాస్(51), చంపాపేటకు చెందిన నరేంద్రకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 26,500 నగదు, ఏడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌ఆర్‌నగర్‌లో..

అమీర్‌పేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వ్యభిచార గృహంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్‌ఆర్‌నగర్ అమీర్‌ఎస్టేట్‌లోని ఓ ఫ్లాట్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు సీసీఎస్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ వింగ్ పోలీసులు దాడులు చేశారు. ఈ సమయంలో ఫ్లాట్‌లో ఉన్న నిర్వాహకులు ఖైరతాబాద్‌లో ఉండే గుంటూరు నివాసి వి.శ్యామ్‌కుమార్, కూకట్‌పల్లి గాయత్రి హిల్స్‌లో ఉంటున్న గుంటూరు వాసి కె.లక్ష్మీదేవి, మేడ్చల్ జిల్లా మల్కాజ్‌గిరికి చెందిన సబ్ ఆర్గనైజర్ ముప్పాల రుక్మిణితో పాటు రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌కు చెందిన ఇద్దరు యువతులను పట్టుకున్నారు. విటుల్లో మహబూబ్‌నగర్ జిల్లా ఆమనగల్‌కు చెందిన విద్యార్థి విజయ్‌కుమార్, పాతబస్తీకి చెందిన పూజారి బానోత్ తరుణ్ ఉన్నట్లు తెలిపారు. ఆర్థిక లాభం కోసం వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్లు, 2025 మే మొదటి వారం నుంచి సెక్స్‌వర్కర్లను కొనుగోలు చేస్తున్నట్లు నిర్వాహకులు అంగీకరించారు. ఈ దాడిలో మొబైల్ ఫోన్లు, స్వైపింగ్ మిషన్, రూ.2వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు, కస్టమర్లు, బాధితులను ఎస్‌ఆర్‌నగర్ పోలీసులకు అప్పగించారు. వీరిచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి కోర్టులో హాజరుపరిచారు. నిందితులను జైలుకు పంపగా, సెక్స్‌వర్కర్లను ఇంటికి పంపించారు.

బీఆర్‌కే భవన్‌కు బీఆర్‌ఎస్ శ్రేణులు

బంజారాహిల్స్/బేగంపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరైన మాజీ సీఎం కేసీఆర్‌కు సంఘీభావం తెలిపేందుకు బీఆర్‌ఎస్ శ్రేణులు బీఆర్‌కే భవన్‌కు చేరుకున్నారు. జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, బీఆర్‌ఎస్ ఖైరతాబాద్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్, కె.విప్లవ్, మాజీ కార్పొరేటర్ ఎలిగల మహేష్‌యాదవ్ ఆధ్వర్యంలో సోమాజిగూడ నుంచి భారీ ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాళేశ్వరంతో రాష్ట్రాన్ని పచ్చదనంగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ కుటిల రాజకీయాలు చేస్తూ విచారణ ఎదుర్కొనేలా చేయడం అన్యాయమని పేర్కొన్నారు.


సోమాజిగూడ నుంచి బీఆర్‌కే భవన్‌కు భారీగా వెళ్తున్న బీఆర్‌ఎస్ నేతలు


కేసీఆర్‌కు సంఘీభావంగా బీఆర్‌కే భవన్‌కు వెళ్లిన కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్


సంఘీభావం ప్రకటిస్తున్న బీఆర్‌ఎస్ ఖైరతాబాద్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, విప్లవ్

అర్చకులు, ఆలయ సిబ్బంది సంక్షేమం కోసం నిధి ట్రస్టు

బంజారాహిల్స్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖ పరిధిలోపనిచేస్తున్న అర్చకులు, ఆలయ సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం నిధి ట్రస్టును ఏర్పాటు చేసిందని దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు. శ్రీనగర్‌కాలనీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం అర్చక అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ ఆలయాల్లో పనిచేస్తున్న ప్రతీ ఒక్కరికి రిటైర్‌మెంట్‌తో పాటు అనారోగ్యం బారిన పడినప్పుడు ఆర్థిక సాయం అందించేలా నిధి ట్రస్టును రూపొందించినట్టు చెప్పారు. దీనివల్ల అర్చక, ఉద్యోగ కుటుంబాలపై ఆర్థిక భారం పడకుండా ఉంటుందని తెలిపారు. త్వరలో అర్చక సంఘాలతో చర్చించి తగిన మార్గదర్శకాలు రూపొందించనున్నట్టు వెల్లడించారు. రంగారెడ్డి, హైదరాబాద్, సికింద్రాబాద్, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన అనేక మంది అర్చకులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావు, రవీంద్రాచార్యులు, అగ్నిహోత్రం చంద్రశేఖర్‌శర్మ, మారుతి సత్యనారాయణశర్మ, కృష్ణమాచార్యులు, బద్రీనాథ్ చార్యులు, వాసుదేవశర్మ, మురళీధరశర్మ, శ్రీనివాస్‌శర్మ పాల్గొన్నారు.


అర్చకులు, ఆలయ సిబ్బందితో మాట్లాడుతున్న వెంకట్రావ్

పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

పంజాగుట్ట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ డివిజన్‌లోని చింతలబస్తీ, తుమ్మలబస్తీ, ఎరుకలబస్తీల్లోని పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని తుమ్మలబస్తీ సమైక్య భారతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కోరారు. బోనాల నేపథ్యంలో అమ్మవారి ఆలయాల వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. బుధవారం ఎమ్మెల్యేకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట అసోసియేషన్ కార్యదర్శి అబ్దుల్ సత్తార్, మహ్మద్ జహంగీర్, తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాగేశ్వరరావు, తదితరులు

ఉత్సాహంగా వయోధికుల ఆత్మీయ సమ్మేళనం

బేగంపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్‌లోని మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం వయోధికుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆసరా సర్కిల్ కమిటీ ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ సాయి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అక్కినేని నాటక కళాపరిషత్ చైర్మన్ సారిపల్లి కొండలరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పలువురు వయోధికులను సన్మానించారు. వయోధికులు చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. కార్యక్రమంలో వయోధిక సంఘాల ప్రతినిధులు డి.పార్థసారథి, ఉమామహేశ్వరరావు, మాణిక్యరావు, పాటిల్, జె.ప్రసాద్ పాల్గొన్నారు.


జేఎస్‌టీ సాయిని సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రతినిధులు

విద్యార్థులు ఆటల్లో రాణించాలి


గెలుపొందిన వారితో తరుణ్ కోన, మధురానగర్ సంక్షేమ సమితి ప్రతినిధులు

వెంగళరావునగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు తరుణ్ కోన అన్నారు. మధురానగర్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో 13 సంవత్సరాలలోపు వారికి వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక ఇండోర్ స్టేడియంలో 45 రోజులపాటు బ్యాడ్మింటన్‌లో శిక్షణ ఇచ్చారు. శిక్షణ ముగింపు సందర్భంగా వారికి పోటీలు నిర్వహించారు. గెలిచిన వారికి బుధవారం ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు, ఉపాధ్యక్షుడు మనోహర్‌రావు, కోశాధికారి సుగుణ, సంయుక్త కార్యదర్శి హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

నాలాల ఆక్రమణదారుల గుండె గుభిల్లు

కంటోన్మెంట్‌లో డ్రోన్ కెమెరాల చక్కర్లు


కంటోన్మెంట్‌లోని ప్రధాన నాలా

సికింద్రాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో నాలాల ఆక్రమణల చిట్టా రూపొందించడానికి ప్రతిపాదించిన డ్రోన్ కెమెరాల సర్వే పూర్తయింది. కంటోన్మెంట్‌లోని కాలనీలు, బస్తీల మీదుగా ప్రవహించే రెండు ప్రధాన నాలాల మీదుగా రెండు రోజుల క్రితం డ్రోన్ కెమెరాలు చక్కర్లు కొట్టాయి. నాలాలు, వాటిపై వెలిసిన కట్టడాలు, నాలాలను ఆనుకుని చేపట్టిన నిర్మాణాలను డ్రోన్ కెమెరాలు నిక్షిప్తం చేశాయి. కాగా ప్రభుత్వ పరిధిలోని నాలాలు, వాటిపై వెలిసిన అక్రమ కట్టడాల గురించి సికింద్రాబాద్ కంటోన్మెంట్ సీఈఓ డి.మధుకర్ నాయక్ హైడ్రాకు లేఖ రాశారు. కంటోన్మెంట్‌లో వరద సమస్య పరిష్కారానికి నాలాల ఆక్రమణలను తొలగించాల్సిన ఆవశ్యకతను హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వివరించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. ఈమేరకు హస్మత్‌పేట్, పికెట్ నాలాల పొడవునా రెండు గంటల పాటు డ్రోన్ కెమెరాలు చక్కర్లు కొట్టి వాటికి అప్పగించిన పని పూర్తి చేశాయి. డ్రోన్ కెమెరాలు సేకరించిన సమాచారాన్ని కంటోన్మెంట్ బోర్డు అధికారులు రికార్డు చేయనున్నారు.

కార్యాచరణ

ఆ తర్వాత హైడ్రా ఉన్నతాధికారులతో కంటోన్మెంట్ బోర్డు ఉన్నతాధికారులు సమావేశం కానున్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా సేకరించిన సమాచారం, రెవెన్యూ రికార్డుల్లో ఉన్న సమాచారాన్ని హైడ్రా ఉన్నతాధికారులకు వివరించనున్నారు. ఆ తర్వాత నాలాల ఆక్రమణల తొలగింపుపై చేపట్టాల్సిన కార్యాచరణపై ఓ కొలిక్కి రానున్నారు.

- ప్రధాన నాలాల విస్తీర్ణం తదితర సమాచారాన్ని, మ్యాప్‌లను రెవెన్యూ యంత్రాంగం నుంచి సమాచారం సేకరించనుంది. రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించి, డ్రోన్ కెమెరాల ద్వారా సేకరించిన సమాచారంతో అధ్యయనం చేయనున్నది. దాంతో నాలాలు ఏ మేరకు ఆక్రమణలకు గురైందీ స్పష్టత వస్తుందని భావిస్తున్నారు.
- నాలాల ఆక్రమణలు, నాలాల పక్కనే వెలిసిన కట్టడాలపై అధ్యయనం చేసేందుకు డ్రోన్ కెమెరాల సర్వే పూర్తి కావడంతో ఆక్రమణదారుల గుండెలు గుభిల్లుమంటున్నాయి. హస్మత్‌పేట్ నాలా ప్రారంభం నుంచి ప్యాట్నీ కాంపౌండ్ వరకు, పికెట్ నాలా ప్రారంభ పాయింట్ నుంచి ప్యాటీ కాంపౌండ్ వరకు పెద్ద సంఖ్యలో కట్టడాలు వెలిశాయి. తాజాగా ఈ ఆక్రమణలపై కొరడా ఝుళిపించడానికి హైడ్రా రంగంలోకి దిగడంతో కబ్జాదారులకు దిక్కుతోచడం లేదని తెలిసింది. నాలాల ఆక్రమణలపై కంటోన్మెంట్ బోర్డు అధికారులు తీసుకునే చర్యలు, హైడ్రా దూకుడుపై నిశితంగా పరిశీలిస్తున్నట్టు తెలిసింది.


అధికారులతో మాట్లాడుతున్న శ్రీగణేష్

డబుల్ బెడ్‌రూమ్‌ల నిర్మాణం పూర్తి చేయాలి

సికింద్రాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రసూల్‌పురా డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ చెప్పారు. ఇళ్ల నిర్మాణ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించినా పనులు ఆలస్యం కావడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. గత పాలకులు గందరగోళంగా కేటాయింపులు చేశారని, ఈసారి అటువంటి తప్పులు జరగకుండా, అర్హులందరికీ ఇళ్లు కేటాయించేలా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. సికింద్రబాద్ తహసీల్దార్ పాండునాయక్, గృహ నిర్మాణశాఖ ఏఈ మహేష్, ఈఈ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ బోర్‌వెల్ ప్రారంభం : ఎమ్మెల్యే శ్రీగణేష్

తిరుమలగిరి జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలోని అంబేద్కర్‌నగర్ కాలనీ వాసుల నీటికష్టాలు తీర్చడం కోసం ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేస్తున్న పవర్‌బోర్‌ను ఎమ్మెల్యే శ్రీగణేష్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఎంతో కాలంగా నీటి కొరతతో ఇబ్బంది పడుతున్న తమ కాలనీకి బోర్ వేయించి నీటి కష్టాలు తీరుస్తున్న ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు.


తరగతి గదులను శుభ్రం చేయిస్తున్న ఉపాధ్యాయులు

విద్యా బోధనకు సిద్ధం

రాంగోపాల్‌పేట్, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవుల అనంతరం తెరుచుకుంటున్న పాఠశాలలు విద్యా బోధనకు సిద్ధమయ్యాయి. రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని నల్లగుట్టలో గల సికింద్రాబాద్ నగరంలోనే ఏకైక ఉర్దూ మీడియం పాఠశాల నూతన విద్యా సంవత్సరానికి సిద్ధమైంది. గత విద్యాసంవత్సరం సికింద్రాబాద్ జోన్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన ఏకైక ఉర్దూ పాఠశాల కావడంతో ఉపాధ్యాయులు మరింత ఉత్సాహంగా బడిబాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల సంఖ్యను పెంచుతున్నారు. గురువారం పాఠశాల పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు అనుగుణంగా పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దడానికి గాను పాఠశాలకు రంగులు, పడిపోయిన ప్రహరీని తిరిగి నిర్మించారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ నిధుల నుంచి నూతనంగా పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా డయినింగ్ హాల్‌ను, మరుగుదొడ్లను నిర్మించారు. అలాగే నూతన తాగునీటి పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు.

ఉత్తమ సేవా పురస్కారాల ప్రదానం

రవీంద్రభారతి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే డ్రైవర్లను సత్కరించుకోవడం అభినందనీయమని ప్రముఖ సాహితీవేత్త ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. బుధవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో టీజీఆర్టీసీ సికింద్రాబాద్ రీజన్ పరిధిలో ప్రమాద రహిత సేవలు అందించిన డ్రైవర్లకు ఉత్తమ సేవా పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పురస్కారగ్రహీతల్ని సత్కరించి అభినందించారు. వ్యక్తిగత జీవితాల్ని పక్కన పెట్టి ప్రయాణికుల కోసం పనిచేసే వృత్తి డ్రైవర్లదని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నటుడు బాబుమోహన్, ఎం.రాజశేఖర్, సుచరిత, రాందాసు తేజావత్, దాసరి దయానంద్‌రెడ్డి, డి.ఎన్..పవిత్ర, అపర్ణా కళ్యాణి, సుధాకర్, పోరెడ్డి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం


షేక్ జహీర్


బౌద్ధనగర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై హజ్మా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం బోలక్‌పూర్ రంగానగర్‌కు చెందిన షేక్ జహీర్(50)కు అనారోగ్యంగా ఉండటంతో భార్య రజియా బేగం ఈనెల 9వ తేదీన ఉదయం పదకొండుగంటలకు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తీసుకువెళ్లింది. జహీర్‌ను ఓపీ వార్డులో కూర్చోబెట్టి అడ్మిషన్ చిట్టి తీసుకువచ్చేలోపు భర్త కనిపించలేదు. జహీర్ కోసం పలుచోట్ల గాలించిన ఫలితం లేదు. తనభర్త కనిపించటంలేదని భార్య రజియాబేగం మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సికింద్రాబాద్‌లో మహిళ..


లలిత

అడ్డగుట్ట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : చెన్నై నుంచి సికింద్రాబాద్‌కు వచ్చిన ఓ మహిళ అదృశ్యమైంది. ఈ సంఘటన గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం మెదక్ ప్రాంతానికి చెందిన అత్తమామలు విశ్వనాథం, లక్ష్మిలతో లలిత కలిసి బుధవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో చెన్నై రైలులో దిగారు. రేతిఫైల్ బస్టాండు నుంచి జూబ్లీ బస్టాండులో దిగి మెదక్‌కు వెళదామని అనుకున్నారు. ముగ్గురు నడుచుకుంటూ వెళుతుండగా రేతిఫైల్ బస్టాండులో అత్తమామ ముందు వెళ్లిపోయారు. కోడలు లలిత వెనుక వస్తుందని అనుకుని పొరపాటు పడ్డారు. తీరా వెనుక చూస్తే లలిత కనిపించకపోవడంతో మామ తన కొడుకు నగేష్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. వెంటనే సికింద్రాబాద్‌లో లలిత కోసం గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో అత్తమామలతో పాటు భర్త గోపాలపుర పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు కింద నమోదు చేసుకున్న పోలీసులు సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు లలితకు మతిస్థిమితం సరిగా లేదని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మరణించాడు. ఈ సంఘటన మేడ్చల్ రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఘట్‌కేసర్ ప్రాంతానికి చెందిన నర్సింగ్‌రావు (45) వ్యక్తిగత కారణాలతో బుధవారం మేడ్చల్ రైల్వేస్టేషన్ సమీపంలో సికింద్రాబాద్ వైపు వస్తున్న రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నాడు. ఈ క్రమంలో రైలు ఇంజన్ ముందు భాగంలో ఇరుక్కుపోయి బలమైన గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం.

1న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణం

మారేడుపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణానికి వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని ఏర్పాట్లను చేస్తామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం ఎల్లమ్మ ఆలయ అధికారులు వెస్ట్ మారేడుపల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి జూలై 1న అమ్మవారి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలియజేస్తూ లేఖను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఈ నెల 14న సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆలయ ట్రస్ట్ ఛైర్మన్ సాయిబాబా గౌడ్, ఈఓ కృష్ణ తదితరులు ఉన్నారు.

నేటినుంచి పాఠశాలలు పునఃప్రారంభం


సిద్ధంగా ఉన్న యూనిఫామ్స్, బుక్స్, ఇతర సౌకర్యాలు

మారేడుపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : నేడు పాఠశాలలు ప్రారంభమయ్యే క్రమంలో మారేడుపల్లి, తిరుమలగిరి మండల జోన్ పరిధిలో ఉన్న ప్రాథమిక, ఉన్నత పాఠశాలల గదులను, పరిసర ప్రాంతాలను శుభ్రం చేస్తూ విద్యార్థినీ, విద్యార్థులకు కల్పించే వసతులపై విద్యాశాఖ అధికారులు దృష్టి సాగించారు. ఈ క్రమంలోనే మారేడుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ ఏడాది ముందుగానే విద్యార్థులకు యూనిఫామ్స్, నోట్ బుక్స్, వర్క్ బుక్స్ అందజేయడానికి ఏర్పాట్లు గావించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉదయం 8.45 నిమిషాల నుంచి నాలుగు గంటల వరకు క్లాసులు చెప్పనున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు కావలసిన బుక్స్ యూనిఫాం తదితరాలను ఏర్పాటు చేశాం. ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలకు వసతులు కల్పించాలని సూచించాం. ముఖ్యంగా తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ ఉండేలా చేసుకోవాలని తెలియచేశాం.

- బాలు నాయక్, మారేడుపల్లి జోన్ డిప్యూటీ ఈఓ

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలి మృతి


సులోచన

అడ్డగుట్ట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్ట డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు సులోచన కొంతకాలంగా అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చేరింది. ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆమె కొన్నేళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకురాలిగా ఉంది. ఆమె మృతి పార్టీకి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గంట రాజుసాగర్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్‌కుమార్ ఆమె కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

మానవ హక్కుల కమిషన్ కార్యదర్శిగా జగన్

పద్మారావునగర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా న్యూబోయిగూడకి చెందిన తాటిపాముల జగన్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు ముదిగంటి శ్రీకాంత్ రెడ్డి బుధవారం జగన్‌కి నియామక పత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు.మానవ హక్కుల పరిరక్షణకి పాటుపడుతానని, అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

అడ్డగుట్ట, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : గాంధీ ఆస్పత్రిలో పెండింగ్ పనులను పూర్తి చేయాలని రాష్ట్ర వైద్య శాఖ సంచాలకులు(డీఎంఈ) డాక్టర్ నరేందర్ కుమార్ గాంధీ సూపరింటెండెంట్ రాజకుమారికి సూచించారు. బుధవారం ఆయన గాంధీ ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆస్పత్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. జరుగుతున్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సూపరింటెండెంట్‌కు సూచించారు.



శుభాకాంక్షలు

టీపీసీసీ ఉపాధ్యక్షురాలిగా నియమితులైన డాక్టర్ కోట నీలిమను శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతున్న సనత్‌నగర్ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్ కుమార్ ముదిరాజ్.

- రాంగోపాల్‌పేట్, ఆంధ్రజ్యోతి



మద్దతుగా..

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై ప్రభుత్వం వేసిన జస్టిస్ బీసీ గోష్ కమిషన్ విచారణకు తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ హాజరుకావడంతో ఆయనకు మద్దతుగా బుధవారం తార్నాక డివిజన్ నుంచి బీఆర్ఎస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ యువజన విభాగం అధ్యక్షుడు ఆలకుంట హరి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బీఆర్‌కే భవన్‌కు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మల్లికార్జున్, కూరెల్లి నాగరాజు గౌడ్, రాజేష్ వైష్ణవ్, ప్రవీణ్, వీణ, మారయ్య, విజయేందర్, కుమారస్వామి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి

బడిబాట కార్యక్రమం


బడిబాట కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి షకీల్‌ఖాన్ తదితరులు

బౌద్ధనగర్, జూన్11(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ షాబాద్‌గూడ కొండారెడ్డినగర్ అంగన్‌వాడి కేంద్రంలో బుధవారం అమ్మమాట, అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నపిల్లలను అంగన్‌వాడి కేంద్రంలో చేర్పించాలని తలపెట్టిన ర్యాలీలో టీపీసీసీ కార్యదర్శి షకీల్‌ఖాన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచరు కె.అనిత, ఎఎన్ఎం రోహిణి, ఆశా, రీనా తదితరులు పాల్గొన్నారు.

పరుగుపందెం వీరుడికి అభినందన


శ్రీనివాస్‌ను అభినందిస్తున్న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

అడ్డగుట్ట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గత మూడేళ్లుగా పరుగు పందెంలో అనేక అవార్డులు పొందిన, గచ్చిబౌలి కమిషనరేట్‌లో విధులు నిర్వహించిన ఎస్పీఓ కానిస్టేబుల్ శ్రీనివాస్ బుధవారం నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ శ్రీనివాస్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

సీసీ రోడ్డుకు మరమ్మతులు చేయాలి

- **వారాసిగూడ పోచమ్మ ఆలయవీధిలో నాణ్యతలేని సీసీ రోడ్డు నిర్మాణం**


వారాసిగూడ పోచమ్మ ఆలయవీధిలో రోడ్డు క్వాలిటీని తనిఖీ చేస్తున్న అధికారులు

బౌద్ధనగర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ డివిజన్ వారాసిగూడ పోచమ్మ ఆలయం వీధిలో ఇటీవల వేసిన నూతన సిమెంట్ రోడ్డు నాణ్యత లోపించింది. దీంతో ఆగ్రహించిన స్థానికులు జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. బుధవారం సిమెంట్‌రోడ్డును జీహెచ్ఎంసీ క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేసి, శాంపిల్స్‌ను సేకరించారు. రెండున్నర సంవత్సరాల క్రితం వారాసిగూడ పోచమ్మ దేవాలయ వీధిలో సివరేజి, తాగునీటి పైపులైన్ల నిర్మాణ పనుల కోసం అప్పట్లో ఉన్న డాంబర్ రోడ్డును తవ్వివేశారు. రెండున్నర సంవత్సరాల నుంచి రోడ్డును నిర్మించకపోవటంతో స్థానికులు ఆందోళనలు చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసిన సందర్భాలున్నాయి. నగర మేయర్ గద్వాల విజయలక్ష్మీ వారాసిగూడ పర్యటనకు వచ్చినప్పుడు పోచమ్మ ఆలయబస్తీవాసులు మేయర్‌కు ఫిర్యాదు చేయటంతో ఆమె వచ్చి తవ్వినరోడ్డును పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించిన ఫలితం లేదు. మూడు నెలల తర్వాత రోడ్డు వేయటానికి రూ.33లక్షలను జీహెచ్ఎంసీ మంజూరు చేసింది. సదరు కాంట్రాక్టర్ సీసీ రోడ్డును నిర్మించటానికి మరో సబ్ కాంట్రాక్టర్‌కు రూ. 25లక్షలకు ఇచ్చినట్లు సమాచారం. దీంతో సదరు సబ్ కాంట్రాక్టర్ నాణ్యతలేని సిమెంట్‌రోడ్డును నిర్మించారని స్థానికులు జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ఫిర్యాదు చేయటంతో క్వాలిటీ కంట్రోల్ అధికారి పాండు ఆధ్వర్యంలో బుధవారం రోడ్డు నాణ్యతను పరిశీలించారు. రోడ్డు నాణ్యత లేదని ఫిర్యాదులు అందాయని, తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. కాంట్రాక్టర్, అధికారులు, కార్పొరేటర్ కుమ్మక్కై నాణ్యత లేని రోడ్డును వేశారని స్థానికులు తెలిపారు. సిమెంట్ రోడ్డుకు మరమత్తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



చిన్నారులకు ఎగ్ బిర్యానీ

వెంగళరావునగర్‌లో వేసవి సెలవుల అనంతరం ప్రారంభమైన అంగన్వాడీలో ప్రభుత్వాదేశానుసారం చిన్నారులకు ఎగ్ బిర్యానీ వడ్డిస్తున్న అంగన్వాడీ టీచర్ రమా.

- రాంగోపాల్‌పేట్, ఆంధ్రజ్యోతి

బడిబాట



నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలలు తెరుచుకోనుండడంతో చిన్నారులను స్కూల్‌కు పంపాలంటూ మడ్‌ఫోర్టు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం మడ్‌ఫోర్టు, కార్ఖానా పరిసరాల్లో బడిబాట నిర్వహించారు. పిల్లలను బడికి పంపాలంటూ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి


శానిటేషన్ వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్ రెడ్డి తదితరులు

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

తార్నాక, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను చేపడుతున్నట్లు జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి అన్నారు. ఈమేరకు బుధవారం తార్నాకలోని తన క్యాంపు కార్యాలయం ఆవరణలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా శానిటేషన్ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని దోమల నివారణ, పారిశుధ్యం వంటి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన శిబిరం

ఆస్తిపన్ను, నల్లా బిల్లులు సకాలంలో చెల్లించాలంటూ కంటోన్మెంట్ బోర్డు అధికారులు బుధవారం 7వ వార్డులోని తిరుమలగిరి టీచర్స్‌కాలనీ కమ్యూనిటీ హాలులో అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పౌరులు బిల్లులు కూడా చెల్లించారు. ఉమానంద్, రవి, జై శివరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి


బోయినపల్లి ప్రభుత్వ పాఠశాలలోని అంగన్‌వాడీ సెంటర్

అంగన్‌వాడీ ముస్తాబు

బోయినపల్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి) :గోడలపై అందమైన ఆట బొమ్మలు, పిల్లల చిత్రాలు చూసి కార్పొరేట్ ప్లే స్కూల్ అనుకుంటున్నారా.. అయితే మీరు పొరపడినట్టే. ఇది బోయినపల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రం. ప్రభుత్వం చొరవతో ఇవి మరింత సుందరంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఈ విద్యా సంవత్సరం కోసం ఈ అంగన్‌వాడీ కేంద్రాన్ని సిబ్బంది వినూత్నంగా తీర్చిదిద్దారు. పాత భవనానికి కొత్త రంగులు వేసి, వసతి సౌకర్యాలు కల్పించారు. చిన్నారులను ఆకర్షించేలా గోడలపై రంగురంగుల బొమ్మలను వేసి చూడముచ్చటగా తీర్చిదిద్దారు. ఇప్పుడు సంతోషంగా హాజరవుతారని అంగన్వాడీ సెంటర్ టీచర్ పావని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

బోయినపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక బోయినపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు బోయినపల్లి డివిజనల్ ఇంజనీర్ గోపాల్‌రావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం శుక్రవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగునున్నది. సుదీర్ఘ కాలంగా నెలకొన్న సమస్యలపై నివేదికలు అధికారులకు ఈ పరిష్కార వేదికలో వినియోగదారులు అందజేయవచ్చునని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.